
సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం । 23 । డిసెంబర్ । 2023



బౌద్ధ భిక్షువుల సందర్శన

విశాఖ నగరంలోని ప్రముఖ బౌద్ధారామాలైన తొట్లకొండ, బావికొండను వివిధ దేశాలకు చెందిన బౌద్ధ భిక్షువులు సందర్శించారు.



ప్రత్యేక అలంకరణలో సిరులతల్లి

మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా విశాఖ నగరంలోని కనకమహాలక్ష్మి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.



ఆకట్టుకున్న కస్తూర్బా విద్యార్థినుల ప్రదర్శన

గణిత దినోత్సవం పురస్కరించుకుని గంగవరం మండలం కొత్తాడ కస్తూర్బా విద్యాలయంలో బాలికల ప్రదర్శన ఆకట్టుకుంది.

న్యూస్‌రీల్

చింతూరులో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం



చింతూరు శబరినది వంతెన ప్రాంతంలో అలముకున్న మంచుతెరలు

చింతూరు: గతంలో ఎన్నడూ లేనివిధంగా చింతూరులో కనిష్టస్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గత రెండు రోజులుగా చింతూరులో 14 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు కావడంతోపాటు దట్టంగా మంచు కురుస్తోంది.చలి ప్రభావం ఎక్కువగా ఉంది. ఉదయం ఎనిమిది గంటల వరకు మంచు తెరలు వీడటం లేదు. చలిని తట్టుకునేందుకు ప్రజలు నెగళ్లను ఆశ్రయిస్తున్నారు.

పొద్దు తిరుగుడుతో భలే ఆదాయం



పర్యాటకులను ఆకర్షించేలా పొద్దుతిరుగుడు పైరులో ఏర్పాటు చేసిన గొడుగులు

డుంబ్రిగుడ: మండలంలోని అరకు–పాడేరు ప్రధాన జాతీయ రహదారి సమీపంలోని జంగిడివలస గ్రామ సమీపంలో పొద్దు తిరుగుడు సాగు సిరులు కురిపిస్తోంది. పైరు మధ్యలో గొడుగులు ఏర్పాటుచేయడంతో సందర్శకులు ఈ తోట వద్దకు వచ్చి ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటున్నారు. ఎన్ని ఫొటోలు తీసుకున్నా ఒకరికి రూ.10 చొప్పున తీసుకోవడంతో రైతుకు అదనంగా ఆదాయం వస్తోంది.

ఎస్‌ఐ ఉద్యోగాలకు ఇరువురి ఎంపిక




నానిబాబు



వీరచక్రధొర

రాజవొమ్మంగి: మండలానికి చెందిన ఇద్దరు యువకులు ఎస్‌ఐ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. దూసరపాము గ్రామానికి చెందిన పోతంశెట్టి చక్రధొర, సింగంపల్లి గ్రామానికి చెందిన విశ్వంశెట్టి నానిబాబు పోలీసుశాఖలో కొలువులు సాధించారు. వీర చక్రధొర ఇప్పటికే తెలంగాణలో ఆర్‌ఎస్‌ఐగా ఎంపికై శిక్షణ పొందుతున్నాడు. ఎంపికైన ఇద్దరు యువకులను స్థానికులు, స్నేహితులు, బంధువులు అభినందించారు.

రద్దీగా వారపు సంతలు



పాడేరు వారపు సంతలో రద్దీగా దుకాణాలు

సాక్షి,పాడేరు: క్రిస్మస్ పండగ నేపథ్యంలో వారపు సంతలు రద్దీగా మారాయి. అరకు, పాడేరు వారపు సంతల్లో దుస్తుల దుకాణాలు అమ్మకాలతో సందడిగా కనిపించాయి. వ్యాపారుల్లో ఆనందం నెలకొంది.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమ్మె



ఆందోళన చేస్తున్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

ముంచంగిపుట్టు: ఆంధ్ర ఒడిశా ఉమ్మడి నిర్వహణలో ఉన్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు శనివారం సమ్మె చేపట్టారు. సీలేరు కేంద్రంగా ఉన్న నాలుగు ప్రాజెక్టుల్లో మూడు చోట్ల పెంచిన మాదిరిగానే తమకు పెంచాలని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరారు. దీనిపై స్పందించాలని ప్రతినిధులు యాజమాన్యాన్ని బీఎస్ పండ, పట్టి పాంగి, సయ్యద్‌బాషా కోరారు.

అడవిపై హక్కు.. గిరి రైతుకు వరం

అటవీహక్కు చట్టం పేద గిరిజనులకు వరంలా మారింది. అడవిపై ఆధారపడి పోడు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్న వారికి అటవీ చట్టాలు ఆటంకంగా మారాయి. గిరిపుత్రులను ఇబ్బందులకు గురిచేశాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అటవీహక్కు వారికి బాసటగా నిలిచింది. దీనిని రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేసి పాడేరు డివిజన్ పరిధిలో 1,09,337 మంది రైతులకు 1,82,516.75 ఎకరాలకు ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు పంపిణీ చేసింది.



పెదబయలు మండలం చుట్టుమెట్ట గ్రామానికి చెందిన ఈమె పేరు పాంగి చంద్రకళ. ఏళ్ల తరబడి సుమారు ఎకరాన్నరలో పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేది. అప్పట్లో అటవీశాఖ నుంచి చట్టపరమైన ఇబ్బందులు ఎదురయ్యేవి. భూమిపై హక్కు లేకపోవడం వల్ల రైతు భరోసా తదితర పథకాలకు దూరమయ్యేది. ఈ పరిస్థితులో అటవీహక్కు అమల్లోకి రావడంతో ఇలాంటి వారెందరికో భూమిపై హక్కులు ఏర్పడ్డాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసి ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు అందజేయడంతో చంద్రకళ లాంటి వాకి ఆర్థిక పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. రైతు భరోసా అమలు కావడంతో ఏటా పెట్టుబడి సాయం సమకూరడం ఆ కుటంబాలకు ఊరట నిచ్చింది.



పాడేరు మండలం మోదాపల్లి పంచాయతీలోని అటవీ భూమిలో గిరిజనులు సాగుచేస్తున్న కాఫీ,అంతర పంటగా మిరియం (ఫైల్)

- జిల్లాలో సత్ఫలితాలిస్తున్న అటవీహక్కు చట్టం
- కేంద్రం ప్రవేశపెట్టినా.. సమర్థవంతంగా అమలుచేసిన రాష్ట్ర ప్రభుత్వం
- పాడేరు డివిజన్లో 1,09,337 మందికి హక్కు పట్టాల పంపిణీ
- 1,82,516.75 ఎకరాల కేటాయింపు

సాక్షి, పాడేరు: వారు గిరిపుత్రులు. పూర్వీకుల నుంచి అడవిపై ఆధారపడి జీవించే కష్టజీవులు. అడవినే సాగుభూమిగా మార్చి పోడు వ్యవసాయం ద్వారా వచ్చే పంటలతో జీవనోపాధి సాగిస్తున్నారు. అటవీ చట్టాలు కారణంగా ఇబ్బందులు ఎదురైన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 2006లో ప్రవేశపెట్టిన అటవీ హక్కు చట్టం వారిని ఆదుకుంది. అదే సమయంలో ఉమ్మడి ఏపీకి సీఎంగా దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు. అటవీ భూముల్లో పోడు వ్యవసాయం చేస్తున్న వారి వివరాలతో కూడిన సర్వేకు ఆయన హయాంలో శ్రీకారం చుట్టారు. ఈ సర్వే పూర్తి అయి పట్టాలు అందించే నాటికి వైఎస్ మృతి చెందారు. ఆ తరువాత వచ్చిన కిరణ్‌కుమార్ రెడ్డి, టీడీపీ ప్రభుత్వం హయాంలో పంపిణీ దాదాపుగా మరుగున పడింది.

జగన్ సీఎం అయిన తరువాత..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తరువాత అర్హులైన వారందరికీ పట్టాలు అందించేందుకు శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా అర్హుల వివరాలను సమగ్రంగా సేకరించి అమలు పరిచేందుకు ఆర్‌వోఎఫ్ఆర్ ప్రత్యేక సెల్‌ను ఐటీడీఏల పరిధిలో ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించి ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని పాడేరులో ఈ సెల్ ఏర్పాటు చేశారు. దీని పరిధిలో అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో పాడేరు, నర్సీపట్నం, అనకాపల్లి రెవెన్యూ డివిజన్లలో 20 మండలాలున్నాయి. వీటిలో షెడ్యూల్–11, నాన్ షెడ్యూల్–9 మండలాలుగా విభజించారు. 20 మండలాల్లో 10 ఫేజ్‌ల్లో 1,12,873 మంది రైతులకు 1,89,103.08 ఎకరాలకు పట్టాలు అందించారు. పాడేరు డివిజన్ పరిధిలో 11 మండలాల్లో 1,09,337 మంది రైతులకు 1,82,516.75 ఎకరాలకు సంబంధించి ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు అందజేశారు.



అటవీ భూముల హక్కుపత్రం

పాడేరు డివిజన్ పరిధిలో..

అరుకువేలీ మండలంలో 8,851 రైతులకు 11,436.87 ఎకరాలు, డుంబ్రిగుడ మండలంలో 10,010 మందికి 9,582.36 ఎకరాలు, ముంచంగిపుట్టు మండలంలో 7,418 మందికి 9,070.13 ఎకరాలు, పెదబయలు మండలంలో 10,362 మందికి 12,662.17 ఎకరాలు, హుకుంపేట మండలంలో 12,730 మందికి 14,460.65 ఎకరాలు, పాడేరు మండలంలో 8,031 మందికి 13,967.93 ఎకరాలు, జి.మాడుగుల మండలంలో 10,062 మందికి 21,765.92 ఎకరాలు, గూడెంకొత్తవీధి మండలంలో 12,821 మందికి 28,969.75 ఎకరాలు, చింతపల్లి మండలంలో 10,716 మందికి 19,830.33 ఎకరాలు, కొయ్యూరు మండలంలో 9,502 మందికి 22,505.52, అనంతగిరి మండలంలో 8,834 మందికి 18,265.12 ఎకరాలకు ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు పంపిణీ చేశారు.

అర్హులందరికీ పట్టాలు

ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాల అందజేతకు ప్రభుత్వం ప్రత్యేక సెల్‌ను పాడేరు ఐటీడీఏలో ఏర్పాటు చేసింది. ఆర్‌వోఎఫ్ఆర్ సెల్ పరిధిలోకి వచ్చిన ప్రతి అర్హుడికి మంజూరైన పట్టాను నేరుగా ఆయా మండలాల తహసీల్దార్లకు అందించాం. పట్టా పొందిన ప్రతి రైతు, భూమి వివరాలను గిరి భూమి వెబ్‌ల్యాండ్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తాం. ఇప్పటి వరకు 10 విడతలుగా పట్టాలు అందించాం. 2005కు 30 ఏళ్లు నిండిన వారినే అర్హులుగా అటవీశాఖ వారి సహకారంతో గుర్తించి, వారికే పట్టాలు అందిస్తున్నాం. ఇంకా ఎవరైనా మిగిలిపోయినా వారికి అందిస్తాం. ఇది నిరంతరం ప్రక్రియ.

– జి.ఈశ్వరరావు, మానిటరింగ్ ఆఫీసర్, ఆర్వోఎఫ్ఆర్ సెల్ జిల్లా ప్రాజెక్టు, పాడేరు ఐటీడీఏ

అవకాశాలను సద్వినియోగం చేసుకోండి

చింతూరు: యువత తమకు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య కోరారు. మండలంలోని కుమ్మూరుకు చెందిన సోడె శ్రీవిద్య ఇటీవల గ్రూప్–1 పరీక్షల్లో ప్రతిభ కనబరిచి ఏలూరు ట్రెజరీ అధికారిగా ఉద్యోగం పొందారు. ఆమెను శుక్రవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో పీవో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవిద్యను ఆదర్శంగా తీసుకుని గిరిజన యువత ఐటీడీఏ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సివిల్స్, గ్రూప్–1,2 ఉచిత శిక్షణ కార్యాక్రమాన్ని సద్వినియోగం చేసుకుని మంచి భవిష్యత్తు ఏర్పరచుకోవాలని కోరారు.



శ్రీవిద్యను సత్కరించిన చింతూరు ఐటీడీఏ పీవో చైతన్య

గిరిజన గ్రామాలన్నింటికి విద్యుత్ సదుపాయం

ఏపీఈపీడీసీఎల్ ఎస్‌ఈ మహేంద్రనాథ్

గూడెంకొత్తవీధి: జిల్లాలోని అన్ని ఆదివాసీ (పీవీటీజీ) గ్రామాలకు విద్యుత్తు సదుపాయం కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టామని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ఎల్ మహేంద్రనాథ్ అన్నారు. శుక్రవారం మండలంలో పర్యటించిన ఆయన స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌ను పరిశీలించారు. పాడేరు డివిజన్ పరిధిలో మొత్తం 60 ప్రత్యేక బృందాలతో ప్రత్యేకంగా సర్వే చేయించామని తెలిపారు. మొత్తం 1470 పీవీటీజీ గ్రామాలకు గాను 1102 చోట్ల సర్వే పూర్తయ్యిందన్నారు. ఇంకా 368 గ్రామాల్లో సర్వే జరుగుతుందన్నారు. సర్వే అనంతరం రాబోయే ఫిబ్రవరి నాటికి విద్యుత్తు సదుపాయం లేని పీవీటీజీ గ్రామాలన్నింటికీ సదుపాయం కల్పించనున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి సబ్‌డివిజన్ డీఈఈ సూర్యప్రకాష్, చింతపల్లి, గూడెంకొత్తవీధి లైన్‌మెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.



గూడెంకొత్తవీధి సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ మహేంద్రనాథ్

తూనికలు కొలతల శాఖ విస్తృత తనిఖీలు

ఐదు కేసుల నమోదు

పాడేరు: వ్యాపారులు తూనికలు కొలతల్లో మోసాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తూనికలు కొలతలు శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ (విశాఖ) పీడీవీ అప్పలరాజు హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం పాడేరు వారపు సంతలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని చికెన్, మటన్, కూరగాయల దుకాణాలను విస్తృతంగా తనిఖీ చేశారు. సినిమాహాల్ సెంటర్, ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాల్లో చికెన్ దుకాణాల్లో వ్యాపారులు మోసాలను గుర్తించారు. తూనికల్లో అక్రమాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యాపారులతోపాటు కాటాకు సీలు లేని రెండు చోట్ల దుకాణాలపై కేసులు నమోదు చేశారు. తూనికలు కొలతలుపై ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. తూనికలు కొలతలు శాఖ అనకాపల్లి ఇన్‌స్పెక్టర్ భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



పాడేరు పట్టణంలోని చికెన్ దుకాణంపై కేసు నమోదు చేస్తున్న అధికారులు

ఆకట్టుకునేలా బోడకొండమ్మ తల్లి వ్యూపాయింట్

చింతపల్లి రూరల్: పర్యాటకులను ఆకట్టుకునేలా బోడకొండమ్మ తల్లి వ్యూపాయింట్ త్వరలో అందుబాటులోకి రానుందని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి తెలిపారు. మండలంలోని లంబసింగి ఘాట్‌లో జరుగుతున్న బోడకొండమ్మతల్లి వ్యూపాయింట్ నిర్మాణ పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పర్యాటక రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. దీనిలో భాగంగానే వ్యూపాయింట్ నిర్మాణ పనులకు తన కోటా నుంచి రూ.50 లక్షలు కేటాయించినట్టు చెప్పారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆమె కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. వ్యూపాయింట్ అందుబాటులోకి వస్తే ఎంతోమంది గిరిజన యువతకు జీవనోపాధి లభిస్తుందని ఎంపీ పేర్కొన్నారు.



వ్యూపాయింట్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అరకు ఎంపీ గొడ్డేటి మాధవి

పారదర్శకంగా ఓటు నమోదు ప్రక్రియ

రాష్ట్ర ఎన్నికల ఎలక్టోరల్ పరిశీలకుడు శ్యామలరావు


అరకులోయ రూరల్: ఓటు నమోదు ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల ఎలక్టోరల్ పరిశీలకుడు జె.శ్యామలరావు ఆదేశించారు. మండల కేంద్రంలోని బి కాలనీలో శుక్రవారం జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్‌తో కలిసి సందర్శించారు. ఆయన ఓటుహక్కు ఉన్న వారితో మాట్లాడారు. ఓటరు నమోదు ప్రక్రియ క్షేత్రస్థాయిలో వేగవంతం చేయాలని, ఓటురు జాబితా నుంచి మృతుల పేర్లను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఇంటింటికీ వెళ్లి పరిశీలించిన అనంతరం ఓటరు జాబితాలో ధ్రువీకరించాలని సూచించారు. అనంతరం పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్‌తో కలిసి తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్షించారు. చేరికలు, తొలగింపులు, మార్పులు, చేర్పులపై ఆయన సూచనలిచ్చారు. తహసీల్దార్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



అరకులో ప్రజలతో మాట్లాడుతున్న శ్యామలరావు, చిత్రంలో జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్

మావోయిస్టుల బంద్‌తో అప్రమత్తం

ఎటపాక: మావోయిస్టులు భారత్ బంద్‌కు పిలుపునివ్వంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. శుక్రవారం మండలంలోని నెల్లిపాక నుంచి జాతీయరహదారిపై చింతూరు వెళ్లే వాహనాలను దారి మళ్లించారు. నెల్లిపాక నుంచి కూనవరం వైపు వెళ్లేలా వాహనదారులకు సూచించారు. అటవీ మార్గంలో ఎటువంటి వాహనాల రాకపోకలు లేకుండా భద్రత చర్యలు చేపట్టారు. సీఆర్‌పీఎఫ్ బలగాలతో నెల్లిపాక వద్ద పహరా నిర్వహించారు. వాహన తనిఖీలు నిర్వహించారు. అనుమానితుల వివరాలు సేకరించి విడిచిపెట్టారు.



నెల్లిపాక వద్ద జాతీయ రహదారిపై సీఆర్‌పీఎఫ్ బలగాల బందోబస్తు

26 నుంచి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు

పాడేరు: జిల్లాలోని ఈనెల 26 నుంచి ఆడుదాం ఆంధ్రాక్రీడా పోటీలు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ ఆదేశించారు. శుక్రవారం తన కార్యాలయం నుంచి జిల్లాలోని 22 మండలాల ఎంపీడీవో, ఎంఈవోలు, డీఈవోలు, డీఎంహెచ్‌వో, డీఎస్‌డీవో, డీఎల్‌డీవోలతో నిర్వహించిన జూమ్ కాన్ఫరెన్సులో మాట్లాడారు. ఈనెల 23, 24 తేదీల్లో జిల్లాలోని అన్ని మండలాల్లో యోగా పోటీలు, 24 మారథాన్ పోటీలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని 352 గ్రామ సచివాలయాలకు ఇప్పటికే క్రీడా పరికరాలు పంపిణీ చేసినట్టుగా ఆయన వెల్లడించారు. ఈనెల 26 నుంచి జనవరి 9 వరకు గ్రామీణ స్థాయి, జనవరి 10 నుంచి 23 వరకు మండలస్థాయి, 24 నుంచి జనవరి 30 వరకు నియోజకవర్గస్థాయి, జనవరి 31 నుంచి ఫిబ్రవరి 5 వరకు జిల్లాస్థాయి, ఫిబ్రవరి 6 నుంచి రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని ఆయన సూచించారు.

ముక్కోటి పర్వదినం.. ఉత్తర ద్వార దర్శనం

- నేడు ఉత్తర ద్వారంలో వైకుంఠనాథుడిగా అప్పన్న దర్శనం
- దేదీప్యమానంగా ప్రకాశిస్తున్న సింహగిరి
- ఉదయం 5.30 గంటల నుంచి ఉదయం 11.30 గంటల వరకే దర్శనాలు

సింహాచలం: ముక్కోటి ఏకాదశి పర్వదినాన శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామిని ఉత్తర ద్వారంలో వీక్షించే వేళయింది. సింహగిరిపై ఆలయ ఉత్తర రాజగోపురంలో శనివారం ఉదయం 5.30 గంటల నుంచి ఉదయం 11.30 గంటల వరకు శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వైకుంఠ నారాయణుడిగా శ్రీదేవి, భూదేవి సమేతుడై దర్శనమీయనున్నారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని దేవస్థానం, పోలీస్, ఆర్టీసీ, జీవీఎంసీ, విద్యుత్, ఫైర్, మెడికల్ అండ్ హెల్త్, రెవెన్యూ, 108 తదితర శాఖల సమన్వయంతో విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. స్వామి దర్శనానికి 50వేల మంది భక్తులు వస్తారన్న అంచనాతో ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు.

క్యూల్లో నడుస్తూనే స్వామిని దర్శించుకునేలా..

ఉచిత దర్శనం క్యూలు, 100, 300 రూపాయల దర్శన క్యూలు, 500 రూపాయల ప్రత్యేక దర్శన క్యూలను పకడ్బందీగా ఏర్పాటు చేశారు. ఉత్తర రాజగోపురం ఎదురుగా భక్తులు క్యూల్లో నడుస్తూనే పదిహేను నిమిషాల పాటు స్వామిని దర్శించుకునే ఏర్పాటు చేశారు. ఉత్తర ద్వారం దర్శనం కాగానే నేరుగా ఆలయంలోకి వెళ్లి నీలాద్రిగుమ్మం నుంచి మూలవిరాట్ దర్శనం చేసుకునేలా క్యూలు రూపొందించారు.



ఏర్పాటు చేసిన క్యూలు

లక్ష లడ్డూలు సిద్ధం

భక్తుల కోసం లక్ష లడ్డూల ప్రసాదాన్ని విక్రయానికి సిద్ధం చేశారు. అలాగే, దర్శనానంతరం భక్తులకు ఆలయ ప్రాకారంలో ఉచిత ప్రసాదం ఇచ్చే ఏర్పాటు చేశారు. అన్నప్రసాద భవనంలో పొంగలి, పులుసు అన్నప్రసాదంగా అందించనున్నారు. క్యూల్లో భక్తులకు మంచినీరు అందించేందుకు పది కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆలయ రాజగోపురాన్ని, ఉత్తర రాజగోపురాన్ని, ఆలయ ప్రాంగణాన్ని విద్యుద్దీపాలతో అలంకరించడంతో సింహగిరి దేదీప్యమానంగా ప్రకాశిస్తోంది. భారీ ఎత్తున పుష్పాలంకరణ చేశారు. వేకువజామున 3 గంటల నుంచి సింహగిరికి ఆర్టీసీ, దేవస్థానం బస్సులు ప్రారంభమవుతాయి.

భారీ పోలీస్ బందోబస్తు

సింహగిరిపై నాలుగు వందల మంది పోలీసులు బందోబస్తు నిర్వహిస్తారని నార్త్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి తెలిపారు. సింహగిరిపై దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తితో కలిసి శుక్రవారం ఏర్పాట్లు పరిశీలించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకున్నట్టు ట్రాఫిక్ డీసీపీ జి.శ్రీనివాసరావు, ఏసీపీ రాజీవ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో గోపాలపట్నం సీఐ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.



ముస్తాబైన ఉత్తర రాజగోపురం

నేటి నుంచి రాత్రి 7 గంటల వరకే దర్శనాలు

అప్పన్న దర్శనాలు శనివారం నుంచి జనవరి 2వ తేదీ వరకు రాత్రి 7గంటల వరకు మాత్రమే లభిస్తాయని అధికారులు తెలిపారు. ఆలయంలో జరిగే రాపత్తు ఉత్సవాల సందర్భంగా ఈ మార్పు చేశామన్నారు.

వైభవుని ఆలయంలో..

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ తెలిపారు. ప్రత్యేక పూజల అనంతరం శనివారం ఉదయం 6 గంటల నుంచి భక్తులకు దర్శనాలు కల్పిస్తామని, మధ్యాహ్నం 2 గంటలకు కొద్దిసేపు విరామం అనంతరం రాత్రి 10 గంటల వరకు స్వామి దర్శనాలు ఉంటాయని తెలియజేశారు. వైభవుడు సర్వాంగ వజ్ర కవచంతో దర్శనమిస్తారన్నారు. భక్తులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాట్లు చేశామని వివరించారు. షిఫ్టుకు 75 మంది చొప్పున పోలీసులు భద్రతా చర్యలు పర్యవేక్షిస్తారన్నారు.

వసతి గృహాల తనిఖీ

విశాఖ విద్య: సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహిస్తున్న నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాస్య పాఠశాల, వసతి గృహాన్ని రాష్ట్ర పర్యవేక్షకురాలు ఎస్.కల్పనాదేవి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో తరగతుల నిర్వహణ, వసతి గృహంలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న పౌష్టికాహారంపై ఎలా ఉందనేది వారిని అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు విద్యార్థులందరికీ రుచికరమైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణతో పాటు, చదువులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నిర్వాహకులకు ఆదేశించారు. ఉన్నత విద్య చదివి, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏఎల్ఎస్‌సీవో జి.శ్రీనివాసరావు, నిర్వాహకులు మంగపతిరావు, గీత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

29న చింతపల్లిలో మినీ జాబ్‌మేళా

పాడేరు: జిల్లాలోని చింతపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 29న మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పాడేరు డీఎస్డీవో ప్రశాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో రెండు కంపెనీల ప్రతినిధులు పాల్గొంటున్నట్టు ఆయన పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, పీజీ చదివిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. పూర్తి వివరాలకు 9491786463, 9398338105 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఆదివాసీలకు నివాస గృహాలు


హౌసింగ్ డీఈఈ రాజుబాబు

అరకులోయటౌన్: ఆదివాసీలకు నివాస గృహాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి జంజాతి ఆదివాసీ న్యాయ అభియాన్ పేరుతో పీవీటీజీలకు గృహాలు మంజూరు చేసినట్టు హౌసింగ్ డీఈఈ రాజుబాబు చెప్పారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ అర్హులైన పీవీటీజీలకు పక్కా గృహాల మంజూరుకు గ్రామాల్లో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సర్వేలు చేస్తున్నట్టు తెలిపారు. నెలాఖరులోగా సర్వే పూర్తవుతుందన్నారు.

అనంతగిరి మండలంలోని 8 గ్రామ పంచాయతీల్లో 14 హేబిఏషన్‌లలో 396 గృహాలు, అరకులోయ మండలంలో 9 జీపీలోని 32 హేబిటేషన్‌లో 1592 గృహాలు, డుంబ్రిగుడలోని 14జీపీలో 69 హెబిటేషన్‌లలో 955 గృహాలు, పెదబయలు మండలంలోని 21 జీపీలో 103 హెబిటేషన్‌లలో 2,579 గృహాలు, ముంచంగిపుట్టు మండలంలోని 22జీపీలో 218 హెబిటేషన్‌లో 3,770, హుకుంపేట మండలంలో 29 జీపీలో 72 హేబిటేషన్‌లోని 1654 మంది లబ్ధిదారులున్నట్టు పేర్కొన్నారు. ప్రతి ఒక్క పీవీటీజిలు ఈ అవకాశాన్ని సద్వినియోడం చేసుకోవాలని డీఈఈ రాజుబాబు కోరారు.

అభివృద్ధి పనులు సత్వరంగా పూర్తి చేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ


సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయ రూరల్: అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ శాఖల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలను పారదర్శకంగా గుర్తించి, అర్హులకు పరిహారం అందేలా చూడాలన్నారు. గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ ద్వారా తాగునీరు అందిస్తున్నామన్నారు. ట్రైబల్ వెల్ఫేర్, పంచాయతీరాజ్ ద్వారా శివారు గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పిస్తోందన్నారు. రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, అటవీశాఖ అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంతోనే ప్రజలకు సమస్యలు పరిష్కారం కావటం లేదని చెప్పారు. వివిధ ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యం ఉన్నా పర్యవేక్షణ లేక తాగునీరు అందడం లేదన్నారు.గిరిజనేతరులు అక్రమ భవనాలు, లాడ్జీలు నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. సంబంధిత అధికారులపై తక్షణం శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు, ఎంపీపీ ఉషారాణి, వైస్ ఎంపీపీ రామన్న, ఎంపీడీవో వెంకటేష్, వివిధశాఖల అధికారులు ప్రజప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు అభినందనలు

- జిల్లాలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియ నిర్వహణ అద్భుతం
- కేంద్ర ఎన్నికల సంఘం ప్రశంసలు


విజయవాడలో జరిగిన కేంద్ర ఎన్నికల సంఘం సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ మల్లికార్జున, సీపీ రవిశంకర్

సాక్షి, విశాఖపట్నం : ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ నిర్వహణ విషయంలో విశాఖ జిల్లా అధికారులు, సిబ్బంది అద్భుతంగా వ్యవహరిస్తూ.. నిబంధనల మేరకు జాబితాలో సవరణలు చేపట్టారని కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు కలెక్టర్ డా.మల్లికార్జునను అభినందించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ–2024, ఎన్నికల సన్నద్ధత కార్యకలాపాలపై రెండు రోజుల పాటు అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో విజయవాడలో సమీక్ష సమావేశం గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా విశాఖ జిల్లా నుంచి కలెక్టర్ డా.మల్లికార్జున, నగర పోలీస్ కమిషనర్ డా.రవిశంకర్ పాల్గొన్నారు. తొలి రోజున 19 జిల్లాలకు సంబంధించిన ఓటర్ల సవరణ జాబితాపై జిల్లాల వారీగా సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలో ఇప్పటి వరకూ నిర్వహించిన ప్రక్రియకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను కలెక్టర్ కేంద్ర ఎన్నికల అధికారుల బృందానికి వివరించారు. ప్రతి ఇంటినీ సందర్శించి కేంద్ర ఎన్నికల కమిషన్ నిబంధనలు తు.చ. తప్పకపాటిస్తూ, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ చేపట్టాల్సి ఉండగా జిల్లాలో శతశాతం పూర్తిచేయడం పట్ల కేంద్ర బృందం కలెక్టర్‌ను ప్రశంసించింది. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని, తొలగింపులు చేపట్టాల్సి వస్తే వాటిని పునఃపరిశీలించిన తర్వాతే తొలగించాలని ఆదేశించారు. ఎలాంటి ఫిర్యాదులు తలెత్తకుండా ఉండేలా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పక్కాగా వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ


ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న లచ్చన్న

తుమ్మపాల: గ్రామ స్థాయిలో 5 నుంచి 15 మంది రైతులు చిన్నచిన్న గ్రూపులుగా ఏర్పడితే ప్రకృతి వ్యవసాయంలో శిక్షణ ఇచ్చి, ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు అధికారి జి.లచ్చన్న తెలిపారు. పట్టణంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన రెండు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ శాఖ, రైతు సాధికార సంస్థ, ప్రకృతి వ్యవసాయ విభాగం సహకారంతో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను స్వయంగా మార్కెటింగ్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్టు చెప్పారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే ఉత్పత్తులను వినియోగించేందుకు అందరూ ఆసక్తి చూపిస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రైనర్ వి.అనుషా, వర్మ, 24 మండలాల సిబ్బంది పాల్గొన్నారు.

కాచిగూడ వరకే మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్

తాటిచెట్లపాలెం: దక్షిణ మధ్య రైల్వే పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విశాఖపట్నం–మహబూబ్‌నగర్(12861) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ కాచిగూడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో శనివారం మహబూబ్‌నగర్–విశాఖపట్నం (128620) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ కాచిగూడ నుంచి బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటుందని రైల్వే అధికారులు తెలిపారు.

టాటానగర్–ఎర్నాకుళం బై వీక్లీ ఇకపై ఐదు రోజులు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల డిమాండ్ దృష్ట్యా టాటానగర్–ఎర్నాకుళం–టాటానగర్ మధ్య వారానికి రెండు రోజులు నడుస్తున్న బై వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను వారంలో ఐదు రోజులు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. టాటానగర్–ఎర్నాకుళం(18189) ఎక్స్‌ప్రెస్‌ను జనవరి 1వ తేదీ నుంచి టాటానగర్‌లో ప్రతీ సోమ, బుధ, గురు, శుక్ర, ఆదివారాల్లో బయలుదేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఎర్నాకుళం–టాటానగర్(18190) ఎక్స్‌ప్రెస్ జనవరి 4 నుంచి ఎర్నాకుళంలో ప్రతీ సోమ, బుధ, గురు, శని, ఆది వారాల్లో బయలుదేరుతుంది.

హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్‌కు మరో థర్డ్ ఏసీ కోచ్

హౌరా–తిరుపతి–హౌరా మధ్య నడుస్తున్న హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్‌కు అదనంగా మరో థర్డ్ ఏసీ కోచ్‌ను శాశ్వత ప్రాతిపదికన జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. హౌరా–తిరుపతి(20889) హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 30వ తేదీ నుంచి, తిరుపతి–హౌరా(20890) హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్‌కు డిసెంబరు 31వ తేదీ నుంచి థర్డ్ ఏసీ కోచ్‌ను అదనంగా జతచేస్తున్నారు.

అప్పన్న భక్తులకు స్వచ్ఛమైన తాగునీరు

సింహగిరిపై 'జలప్రసాదం' ప్రారంభం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని సింహాచలం దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎస్.శ్రీనివాస మూర్తి తెలిపారు. అందులో భాగంగా దాతల సహకారంతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. సింహగిరిపై దివీస్ లేబొరేటరీస్ ఏర్పాటు చేసిన నాలుగు ఆర్వో వాటర్ ప్లాంట్లను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొత్తం రూ.96లక్షలతో ఆరు ప్రదేశాల్లో దివీస్ జలప్రసాదం ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించాయని, ఇప్పటికే రెండు ప్లాంట్లు ప్రారంభం అయ్యాయని చెప్పారు. శుక్రవారం మరో నాలుగు ప్లాంట్లు అందుబాటులోకి వచ్చాయని తెలియజేశారు. భక్తులకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు ఈ ప్లాంట్లు ఉపయోగపడతాయన్నారు. మాస్టర్ ప్లాన్‌ను ఆధారంగా చేసుకుని సింహగిరిని మరింతగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న దివీస్ చైర్మన్ మురళీకృష్ణ మాట్లాడుతూ తమ సంస్థ పలు దేవాలయాల్లో ఇప్పటికే జలప్రసాదం ప్లాంట్లు ఏర్పాటు చేసిందన్నారు. దేవాలయాల అభివృద్ధిలో తమ వంతు సహకారం ఎప్పుడూ అందిస్తామన్నారు. కార్యక్రమంలో దివీస్ ప్రతినిధులు కోటేశ్వరరావు, సురేష్, వరహాలరెడ్డి, శ్రీనివాస్, శేఖర్‌బాబు, దేవస్థానం ట్రస్టీబోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, సంపంగి శ్రీనివాసరావు, వారణాసి దినేష్‌రాజ్, దొడ్డి రమణ, సతీష్, పెనుమత్స శ్రీదేవి వర్మ తదితరులతో పాటు దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, ఏఈవోలు నరసింహరాజు, నరసింగరావు, డీఈ హరి, పీఆర్వో నాయుడు పాల్గొన్నారు.

27 నుంచి గ్రూప్–1, గ్రూప్–2 అభ్యర్థులకు శిక్షణ

తుమ్మపాల: గ్రూప్–1, గ్రూప్–2 అభ్యర్థులకు ఈనెల 27వ తేదీ నుంచి ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభంకానున్నట్లు సంచాలకులు/ జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారత అధికారి కె.రాజేశ్వరి తెలిపారు. డిగ్రీలో మార్కుల ఆధారంగా మెరిట్‌ను నిర్ణయించి, గ్రూప్–2 శిక్షణకు 40 మందిని ఎంపిక చేస్తామన్నారు. గ్రూప్–2 ప్రిలిమినరీ పరీక్ష శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ గడువు శుక్రవారంతో ముగిసిందని చెప్పారు. గ్రూప్ –1 అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 31వ వరకు గడువు ఉందన్నారు. గ్రూప్ – 1 శిక్షణకు 60 మందిని ఎంపిక చేస్తామన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను సర్దార్ గౌతు లచ్చన్న ఏపీ బీసీ స్టడీ సర్కిల్, విశాఖపట్నం, ఎంవీపీ కాలనీలో అందజేయాలన్నారు. మరితం సమాచారం కోసం 0891– 2564346, 9492569177 అనే ఫోన్‌నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కేజీహెచ్‌లో పడకలు సిద్ధం

100 ఆక్సిజన్, 40 వెంటిలేటర్ పడకలను సిద్ధం చేసిన అధికారులు


కేజీహెచ్‌లో సిద్ధమైన ఆక్సిజన్ పడకలు

మహారాణిపేట: జిల్లాలో కరోనా కేసులు నమోదు కావడంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. కేజీహెచ్ క్యాజువాలిటీలోని ఐసోలేషన్ వార్డుతో పాటు మరో వార్డులో మొత్తం 140 పడకలను సిద్ధం చేశారు. క్యాజువాలిటీలో ఉన్న 100 పడకలకు ఆక్సిజన్ సౌకర్యం కల్పించారు. సీఎస్సార్ వార్డులో 40 పడకలను వెంటిలేటర్‌తో సిద్ధం చేసినట్లు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ తెలిపారు. కాగా.. కరోనా కొత్త వేరియంట్‌లో జ్వరం, ముక్కు కారడం, గొంతునొప్పి, తలనొప్పి లక్షణాలు ఉంటాయి. కొంత మందిలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తుతాయి.

నగరంలో ముగ్గురికి కరోనా

విశాఖలో శుక్రవారం ముగ్గురికి కరోనా వైరస్ సోకింది. కొద్ది రోజులుగా దగ్గు,జ్వరం లక్షణాలతో ఉన్న వారికి పరీక్షలు చేయగా వారిలో ముగ్గురికి కరోనా కొత్త వేరియంట్ జెఎన్–1 నిర్ధారణ జరిగిందని ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు తెలిపారు. ఆంధ్ర మెడికల్ కాలేజీ వీఆర్‌డీఎల్ నుంచి తీసిన ఈ శాంపిల్స్‌ను పూణేలో ఉన్న జీనోమ్ సీక్వెన్సీకు పంపినట్టు ఆయన వివరించారు. అక్కడ ఇంకా నిర్ధారణ జరగవలసి ఉందన్నారు. 21 మందికి పరీక్షలు చేయగా,ఇందులో ముగ్గురికి కరోనా వైరస్ సోకినట్టు తేలిందని ప్రిన్సిపల్ వివరించారు. చినముషిడివాడ, మధురానగర్, దసపల్లా హిల్స్ ఏరియాల్లో ఉన్న వ్యక్తులకు వైరస్ సోకిందన్నారు.

రోడ్డుప్రమాదంలో గాయపడిన వృద్ధురాలి మృతి

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు శుక్రవారం విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు అదనపు ఎస్‌ఐ జె. నాగేశ్వరరావు తెలిపారు. నరసింగబిల్లి నుంచి చింతలపాలెంలో జరిగిన వివాహానికి వెళ్లి తిరిగి తన గ్రామానికి నడిచి వస్తున్న జెట్టపు రెడ్డి తునికి చెందిన ఎర్ర కాశీరత్నం(65)ను ఈ నెల 20న గొబ్బూరు నుంచి నరసింగబిల్లి వైపు వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన కాశీరత్నంను విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

సింహగిరిపై వైభవంగా ధనుర్మాస పూజలు

- ముగిసిన పగల్‌పత్తు ఉత్సవాలు
- నేటి నుంచి రాపత్తు ఉత్సవాలు


విశేష అలంకరణలో గోదాదేవి

సింహాచలం: సింహగిరిపై ధనుర్మాస పూజలను ఆరోరోజు శుక్రవారం విశేషంగా నిర్వహించారు. తెల్లవారు జామున 3 గంటలకు స్వామికి సుప్రభాత సేవ నిర్వహించారు. విశేష ఆరాధన, చతుర్వేద పారాయణం పఠించారు. దాదేవికి బేడామండపంలో తిరువీధి వైభవంగా నిర్వహించారు.

ముగిసిన పగల్‌పత్తు ఉత్సవాలు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో పగల్‌పత్తు ఉత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి.అయ్యవారి సేవలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను విశేషంగా అలంకరించి పల్లకీ అధిష్టింపజేసి ఆలయ బేడామండపంలో వితిరువీధి నిర్వహించారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, సంపంగి శ్రీనివాసరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కాగా శనివారం నుంచి ఆలయంలో రాపత్తు ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. పదిరోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో ప్రతీ రోజూ స్వామి ఒక్కో అలంకారంలో దర్శనమిస్తారు.

➧ శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ధనుర్మాస పూజలు విశేషంగా నిర్వహించారు. గోదాదేవిని విశేషంగా అలంకరించి వేదికపై అధిష్టింపజేశారు. పాశుర విన్నపం పఠించారు. ఆలయ అర్చకుడు భార్గవ్ తదితరులు ఈ పూజలు నిర్వహించారు.

వైభవంగా కనకమహాలక్ష్మి అమ్మవారి సారె ఊరేగింపు



యలమంచిలి రూరల్:పట్టణంలోని ధర్మవరం కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిరమాసోత్సవాల్లో భాగంగా రెండో శుక్రవారం అమ్మవారి సారె ఊరేగింపు సంప్రదాయబద్ధంగా జరిగింది.మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ఇష్టమైన పిండివంటలు, పండ్లను బాజా భజంత్రీలు, సన్నాయి వాయిద్యాల నడుమ ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఊరేగింపు జరిపారు. సారె ఊరేగింపులో భాగంగా అమ్మవారి ఉత్సవ మూర్తిని పల్లకీలో ఊరేగించారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.

గంజాయి రవాణా అడ్డుకట్టకు ప్రత్యేక నిఘా

డీఎస్పీ సుబ్బరాజు


దేవరాపల్లి పోలీస్ స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న అనకాపల్లి డీఎస్పీ సుబ్బరాజు

దేవరాపల్లి/కె.కోటపాడు: గంజాయి రవాణాను పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఉంచినట్టు అనకాపల్లి డీఎస్పీ వి.సుబ్బరాజు తెలిపారు. వార్షిక తనిఖీలో భాగంగా దేవరాపల్లి, కె.కోటపాడు పోలీస్‌స్టేషన్లను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్లలోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. గంజాయి కేసులకు సంబంధించి ఇతర రాష్ట్రాలు, జిల్లాల్లో పరారీలో ఉన్న వ్యక్తుల వివరాలపై ఆరా తీశారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా సమస్యాత్మక గ్రామాల్లో ఘర్షణలకు దిగే వ్యక్తులను ముందుగా గుర్తించి, బైండోవర్ చేయాలని ఆదేశించారు. గంజాయి నిర్మూలనకు మాడుగుల మండలం తాటిపర్తి, చీడికాడ మండలం కోనాంలవద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని, నేరుగా తమకు వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించేందుకు మొబైల్ చెకింగ్ టీమ్ సైతం నిరంతరం పనిచేస్తుందన్నారు. గంజాయి కేసుల్లో పరారీలో ఉన్న వ్యక్తులను, నాన్ బెయిల వారెంట్ జారీ అయిన వ్యక్తులను పట్టుకునేందుకు జిల్లాలో ప్రత్యేక టీమ్‌లు పని చేస్తున్నాయని, ఎస్పీ నేతృత్వంలో ఈ టీమ్‌లు మానటరింగ్ జరుగుతోందని చెప్పారు. స్టేషన్ల ఆవరణలను సుందరంగా తీర్చిదిద్దడంపై డీఎస్పీ సంతృప్తి వ్యక్తం చేశారు.ఆయన వెంట ఇన్‌చార్జ్ సీఐ కె.కుమార స్వామి, ఎస్‌ఐలు డి. నాగేంద్ర, ఆర్.ధనుంజయ్ ఉన్నారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి


మహేష్ మృతదేహం

అనకాపల్లి: బ్రాండిక్స్ బస్సు ఢీకొని బొడ్డే మహేష్(56) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాఫిక్ ఎస్‌ఐ జె.రమేష్ కథనం మేరకు వివరాలు... స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రామాలయం సమీపంలో మహేష్ తన గేదెలకు కుడితి తీసుకువెళ్లేందుకు రిక్షాతో వస్తున్న సమయంలో అనకాపల్లి నుంచి అచ్యుతాపురం వెళుతున్న బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కోడలు విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.